క్లుప్తంగా

అద్దంకి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా లక్ష్మి



అద్దంకి రూరల్: అద్దంకి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా కడవకుదురు లక్ష్మి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చీరాల నుంచి బదిలీపై అద్దంకికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన నారాయణ బదిలీపై ఒంగోలు వెళ్లారు.

అద్దంకి డీటీ బదిలీ..

అద్దంకిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీ. సుధారాణిని పర్చూరుకు బదిలీ చేస్తున్నట్లు మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. చీరాలలో డీటిగా పని చేస్తున్న పీ. సురేష్‌బాబు అద్దంకి డీటిగా బదిలీపై రానున్నారు.

అనాథాశ్రమానికి బియ్యం, పండ్లు పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలోగల అనాథ వృద్ధాశ్రమానికి సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెండు బస్తాల బియ్యం, వృద్ధులకు పండ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు సేవాభావాన్ని కలిగి ఉండటం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అనేక సార్లు వారి దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి జ్యోతి స్వరూప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న ఎంఈఓ వీరాంజనేయులు

జే.పంగులూరు: విద్యార్థులు ఆటలాడటంతో మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉంటారని ఎంఈవో వీరాంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ జరిగాయి. ఈ పోటీలను ఏంఈఓ ప్రారంభించి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనిత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న రవిశంకర్

చీరాల రూరల్: వ్యక్తిగత శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని దత్తోపంత్ ఠేంగడి జాతీయ కార్మిక, అభివృద్ధి సంస్థ విజయవాడ సంచాలకులు ఆర్. రవిశంకర్ అన్నారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖలో విభాగమైన దత్తోపంత్, ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో స్వచ్ఛత, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రవిశంకర్ విద్యార్థినిలతో మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా–2024లో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశాలపై సదస్సు నిర్వహించామని వివరించారు. కోర్సులు పూర్తిచేసిన తరువాత విద్యార్థినులంతా జాతీయ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌నందు పేర్లు నమోదుచేసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మతిన్, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ తప్పనిసరి

చీరాల టౌన్: పొదుపు మహిళలు మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెల 10వ తేదీన సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.



వేమవరంలో పత్తి పొలంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి



గన్నవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు



రామకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం..

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు

● మొదలైన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కే ధనరాజు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ సీ కల్యాణి అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకష్ణ మాట్లాడుతూ వ్యవసాయశాఖలో సాంకేతికతో డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందుల పిచికారీ విధానాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. పొలాల్లో చీడపీడలు గుర్తించేందుకు సీఎల్ఎస్ యాప్ ప్రవేశపెట్టిందని తెలిపారు. ముందుగా వరి పంటను పరిశీలించారు. పంటలో చీడపీడలు లేనప్పుడు అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయ సంచాలకులు మోహనరావు మాట్లాడుతూ రాయితీపై ఎర్ర జొన్నలు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ఉద్యాన అధికారిని దీప్తి మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతులకు విత్తనాలపై ఎకరాకు రూ.8 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనంపాడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, ఏఈవో



ధర్మవరంలో మాట్లాడుతున్న ఏడీఏ ధన్‌రాజు

కోటేశ్వరరావు, వీఏఏ రోజీ తదితరులు పాల్గొన్నారు

తెగుళ్లపై అవగాహన ఉండాలి..

■ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో కార్యక్రమాన్ని ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాగు చేసిన పైరులో వచ్చే తెగుళ్ల నివారణ, సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో అంజిరెడ్డి, ఏఈఓ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

■ జే.పంగులూరు మండలం రామకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందించారు. పశువైద్యుడు మురళీకృష్ణ పశువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ, వీఏఏ పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

■ కొరిశపాడు మండలం మేదరమెట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏవో శ్రీనివాసరావు పొలంలో విత్తనం వేసినప్పటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు రైతులు చేపట్టాల్సిన అధునాతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

■ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బల్లికురవ మండల వేమవరంలో ఏవో కుమారి పత్తి, పొగ నారుమడులను పరిశీలించారు. పత్తిలో సస్యరక్షణ గురించి తెలిపారు. వెటర్నరీ డాక్టర్ వెంకట్రావు పశు బీమా, పశువుల్లో వచ్చే వ్యాధులు, టీకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట సుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు అలివేలమ్మ పాల్గొన్నారు.

వారంలో రెండు రోజులు పొలం పిలుస్తోంది..

మార్టూరు: ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి మంగళ, బుధవారాల్లో రైతుల కోసం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వీ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని డేగరమూడి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పత్తి సాగు చేస్తున్న రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రస్తుతం ఉన్న చల్లని వాతావరణానికి పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరమైన పరిస్థితుల్లో పురుగు మందులను పిచికారీ చేయాలని తెలిపారు. ఉద్యానవనశాఖ అధికారి బి హనుమంతు నాయక్, పశు వైద్యురాలు మాధవిలత స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



మేదరమెట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

మేలైన వంగడాలతో దిగుబడులు..

యద్దనపూడి: మేలైన వంగడాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని గన్నవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఎక్కువశాతం సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవశిలీంద్ర నాశినులు, వేప కషాయం లేదా వేపనూనె వంటి ప్రకృతి వనరులను వినియోగించుకోవాలన్నారు. దీంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



బల్లికురవలో మాట్లాడుతున్న ఎంపీడీవో



కారంచేడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

బల్లికురవ/అద్దంకి: పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణాలను పూర్తిచేయాలని ఆశాఖ అధికారులు పేర్కొన్నారు. సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటి నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షను మండల ప్రత్యేకాధికారి రమేశ్ నిర్వహించారు. సమీక్షలో జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాల పురోగతి, ఎన్ని నిర్మాణంలో ఉన్నాయి.. ఎన్ని నిర్మించాల్సి ఉందనే దానిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోపీ ఆర్‌ఆర్‌డీ పాల్గొన్నారు.

■ మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా బల్లికురవలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంబాబు అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని వారిని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉండకూడదు..

కారంచేడు: పీఎంఏవై స్కీంలో మంజూరు అయ్యి ఇంకా పూర్తి కాని గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా సచివాలయ ప్రత్యేక అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో బీబీఎల్‌లో మంజూరు అయిన 349 గృహాలు, బీఎల్‌ఓలో మంజూరు అయిన 15 గృహాలను 2025 మార్చి 31లోగా పూర్తి చేయించాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులదేనన్నారు. అలాగే ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభించే 'మన ఇల్లు–మన గౌరవం' ద్వారా ఇప్పటికే రూఫ్ లెవల్‌లో ఉన్న 11 గృహ నిర్మాణాలు, రూఫ్‌కాస్ట్‌లో మరో 11 గృహనిర్మాణాలను సైతం అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు కే నరశింహారావు, డీటీ పీ సుశీల, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ఎం వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ షేక్ ఖాశీంసాహెబ్, ఏపీఎం మధుసూదనరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులతో కొలువుదీరిన ఉపఖజానా

చీరాల టౌన్: జిల్లాలో సంచలనంగా మారిన ఖజానా ఉద్యోగుల వ్యవహారంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ఆదేశాలతో చీరాల ఉపఖజానా కార్యాలయం నూతన ఉద్యోగులతో కొలువుదీరింది. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ట్రెజరీ ఉద్యోగుల్లో చీరాల ఎస్టీవో భాగ్యలక్ష్మీతో పాటుగా, సీనియర్ అసిస్టెంట్ సుధీరలను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఖజానా కార్యాలయంలో అక్రమాలపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్ నూతన ఉద్యోగులను నియమించారు. గతంలో ఇక్కడ పనిచేస్తూ అక్రమాలకు పాల్పడిన వారిని దూరా ప్రాంతాలైన గిద్దలూరు, నెల్లూరు, దర్శి ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం కార్యాలయ ఎస్టీవోగా ఎంవీ.సుబ్బారావు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన సిబ్బందిలో ఒంగోలు డీటీవో కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా మాలతీ, బేబీలు, జూనియర్ అసిస్టెంటు ప్రసన్న లక్ష్మీ, కనిగిరి ఎస్టీవో కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా శంకర్, షరాఫ్‌గా నరేంద్రలు, మార్కాపురం ఎస్టీవో కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ అంజయ్య, దర్శి ఎస్టీవో కార్యాలయం నుంచి మునిలను చీరాలకు కేటాయించగా విధుల్లో చేరారు. గతంలో పనిచేసిన ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే నిర్ధారణ కావడంతో చీరాల ఖజానా కార్యాలయానికి కొత్త ఉద్యోగులు వచ్చి బాధ్యతల్లో చేరారు. ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులను చీరాల ఎస్టీవో కార్యాలయానికి బదిలీ చేశారు.



నూతన ఎస్టీవోగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

చీరాల టౌన్: రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందితో సమన్వయంగా పనిచేసి ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందించేందుకు చర్యలు తీసుకుంటునానమని, రెవెన్యూ అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగకుండా ఒక్క రోజులోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు వీఆర్‌వో, డిప్యూటీ తహసీల్దార్‌లకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రూరల్ మండల పరిధిలో కొన్ని చోట్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఆయా ప్రాంతాల్లో పోలీసులు, మైనింగ్ అధికారులను సమన్వయం చేసుకుని ఇసుక అక్రమాలను అడ్డుకోవాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు తమ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని తహశీల్దార్ సూచించారు. సమావేశంలో డీటీ సురేష్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ గోపీకృష్ణ

సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

చినగంజాం: ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినగంజాం, పల్లిపాలెం గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, నాయకులు అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం చినగంజాంలో ఆశీర్వాదం కాంప్లెక్స్ సమీపంలో రూ.7 లక్షలు, విజయరావు బజారు రూ.23.50 లక్షలు, పల్లిపాలెం రూ.17 లక్షలు సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే స్వరూపరాణి, ఏఈ పీఆర్ డీ దాసు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, సైకం మణి, గ్రామ కార్యదర్శి నాగేంద్ర బాబు, వీరయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

పోషకాహారం చిన్నారులకు రక్షక కవచం

వేటపాలెం: చిన్నపిల్లల ఆరోగ్యానికి పోషకాహారం రక్షా కవచంలాంటిదని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో ఎం సుచిత్ర తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ క్లబ్‌లో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలకు పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు వివిధ పదార్థాలతో కూడిన పోషకాహారం తయారు చేసి అందరికి పంచిపెట్టారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సజ్జా పుష్పవల్లి, లీలావతి, గొల్లపూడి సీతారం, రోటరీ అధ్యక్షుడు సురేష్ బాబు, కార్యదర్శి లక్ష్మణస్వామి సభ్యులు మోహన్‌రావు పాల్గొన్నారు.



వేటపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కారంచేడులో పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న హెచ్ఎం, సూపర్‌వైజర్



వీరన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుభద్రాదేవి

వర్షపు నీరు తల్లీపిల్లలకు ఆరోగ్యకరం..

పర్చూరు (చినగంజాం)/కారంచేడు: వర్షపు నీరు తల్లీపిల్లలకు ఎంతో ఆరోగ్యకరం అని పర్చూరు సీడీపీఓ సుభద్రాదేవి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమె వీరన్నపాలెం–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వచేసుకొని వాటిని వేడిచేసి తాగడం వలన అనేక ప్రయోజనాలున్నాయని చెప్పారు. వర్షపు నీటిలో శరీర నిర్మాణానికి అవసరమైన విటమిన్ ఏ,ఈలతో పాటు ఐరన్, కాల్షియంలాంటి ఖనిజ లవణాలు కూడా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ సూపర్ వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

■ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డలు మంచి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ సుమలత అన్నారు. మండల కేంద్రం కారంచేడులో యూపీ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవంలో ఆమె తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం జీ శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రసాద్

చీరాల అర్బన్: గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకమని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎకనామిక్స్ డిపార్టుమెంట్ పీడీ స్కాలర్ పీఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం గుర్రం జాషువా జయంతి వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జె.సరళ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన జాషువా రచించిన గబ్బిలం పద్య రచన, అందులోని అర్థాలను గురించి ప్రత్యేకంగా వివరించారు. సమాజంలో జరుగుతున్న విషయాలను విద్యార్థులకు తెలియచేసి రాబోయే రోజుల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పి.జయరాజు, ఎం.హెప్సిబా, గుర్రం శామ్యేల్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

చీరాల అర్బన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై మంగళవారం కొత్తపేటలోని నారాయణ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వాడకం తగ్గించడం, తిరిగి ఉపయోగించడం, రీ సైక్లింగ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిపావని, అకడమిక్ డీన్ ఎ.కృష్ణమూర్తి, జీవన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


దైవాలరావూరులో ఇది మంచి ప్రభుత్వం

మేదరమెట్ల: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఐసీడీఎస్ పీడీ కే.ఉమ, తహసీల్దార్ మెహతాజ్, ఎంపీడీవో సురేష్ బాబు, సీడీపీవో కృష్ణకుమారి, పలు శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్‌తో రైతులకు ఉపయోగాలు

పర్చూరు (చినగంజాం): ఈ–క్రాప్‌తో రైతులకు పలు ఉపయోగాలు ఉంటాయని పర్చూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ మోహనరావు అన్నారు. మండలంలోని చెరుకూరు గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అనివార్య కారణాల వలన పంట వరద ముంపుకు గురైనా, కరువు వచ్చిన పంట నష్ట పరిహారం, ఉచిత బీమా వర్తిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో ఎస్ మేరిమ్మ, పర్చూరు మాజీ ఎంపీటీసీ దాసరి ఉషారాణి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ జీ నాగసాయి కళ్యాణ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలకు అధిక ప్రాధాన్యత



ఎత్తిపోతల పథకం వాటర్ స్కీం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చీరాల: కూటమి ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామంలో నాయనపల్లి ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం విద్యుత్ మోటార్లను మరమ్మతులు చేసి ఆయకట్టుకు నీటిని అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, భాద్రపద మాసం, ఆరుద్ర నక్షత్రం అష్టమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.